నీరసించిన ఎగుమతులు

21 బిలియన్ డాలర్లకు వాణిజ్యలోటు

న్యూఢిల్లీ, జూలై 15: రికార్డు స్థాయిలో దూసుకుపోయిన ఎగుమతులు మళ్లీ నీరసించాయి. గత నెలలో దేశీయ ఎగుమతులు కేవలం 2.56 శాతం పెరిగి 35.2 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. ఇదే సమయంలో దిగుమతులు 5 శాతం ఎగబాకి 56.18 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో వాణిజ్యలోటు 20.98 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే నెలలో 19.19 బిలియన్ డాలర్లుగా ఉన్నది. క్రూడాయిల్, పప్పుదినుసులు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు అధికంగా దిగుమతికావడం వల్లనే లోటు అధికంగా పెరిగిందని తెలిపింది. మరోవైపు, ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో ఎగుమతులు 5.84 శాతం పెరిగి 109.96 బిలియన్ డాలర్లకు చేరుకోగా, దిగుమతులు 7.6 శాతం అధికమై 172.23 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో వాణిజ్యలోటు 62.26 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

- చమురు దిగుమతులు 19.62 శాతం పెరిగి 15 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఏప్రిల్-జూన్ మధ్యకాలంలో 23 శాతం ఎగబాకి 51.5 బిలియన్ డాలర్లకు చేరాయి.
- కానీ, పసిడి దిగుమతులు 38.66 శాతం తగ్గి 3 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 1.91 శాతం పెరిగి 9.51 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.
- గత నెలలో 30.27 బిలియన్ డాలర్ల విలువైన సేవలు ఎగుమతయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో 27.79 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.
- అమెరికా, యూఏఈ, మలేషియా, బంగ్లాదేశ్, తాంజానియా, నెదర్లాండ్స్, సింగపూర్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వస్తువులు, సేవల ఎగుమతులు *800 బిలియన్ డాలర్లకు* చేరుకునే అవకాశం ఉన్నది. ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా స్యూటికల్స్, కాఫీ, కెమికల్స్ ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్ ఉండటంతో ఎగుమతుల్లో రెండంకెల వృద్ధి నమోదైంది.

-సునీల్ బార్త్వాల్,
వాణిజ్య శాఖ కార్యదర్శి

రుణగ్రహీతలకు ఎస్బీఐ షాక్



ముంబై, జూలై 15: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) తమ రుణగ్రహీతలకు షాకిచ్చింది. ఆయా కాలవ్యవధులతో కూడిన రుణాలపై వడ్డీ రేట్లను పెంచుతున్నట్టు సోమవారం ప్రకటించింది. ఈ క్రమంలోనే మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్-బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్)ను 10 బేసిస్ పాయింట్లదాకా పెంచింది. ఎంసీఎల్ఆర్ అంటే.. కనీస రుణ రేటు. దీనికంటే తక్కువ వడ్డీరేటుకు బ్యాంకులు రుణాలివ్వరాదు. ఎస్బీఐ అధికారిక వెబ్‌సైట్ ప్రకారం పెరిగిన వడ్డీరేట్లు వెంటనే అమల్లోకి వస్తాయి.

ఈఎంఐల భారం

ఎస్బీఐ తీసుకున్న తాజా నిర్ణయంతో ముఖ్యంగా వాహన, గృహ రుణాలు ప్రియమైపోయాయి. ఇప్పటికే ఆటో, హోమ్ లోన్లపై వడ్డీ రేట్లు మోయలేనంతగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటి ఈఎంఐలు మరింత పెరిగాయి. కరోనా మహమ్మారి ప్రభావంతో బలహీనపడ్డ దేశ ఆర్థిక వ్యవస్థను బలపర్చేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) 2020లో వడ్డీ రేట్లను గణనీయంగా తగ్గించిన విషయం తెలిసిందే. దీంతో అంతా రుణాలు తీసుకున్నారు. అయితే కరోనా పరిస్థితులు అదుపులోకి రావడం, మరోవైపు ద్రవ్యోల్బణం విజృంభించడంతో ధరలను కట్టడి చేయడానికి సెంట్రల్ బ్యాంక్ వడ్డీరేట్లను పెంచుకుంటూపోయింది. వరుస ద్రవ్యసమీక్షల్లో వడ్డనల వల్ల రెపో రేటు గరిష్ఠంగా 6.50 శాతానికి చేరింది. నిరుడు ఫిబ్రవరిలో ఆఖరిసారిగా పెంచగా.. అప్పట్నుంచి రెపో అక్కడే ఉంటున్నది. దీంతో బ్యాంకులూ, ఇతరత్రా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలూ తమ రుణాలపై వడ్డీరేట్లను ఆ మేరకు పెంచేశాయి. ఫలితంగా వడ్డీరేట్లు తక్కువగా ఉన్నాయని రుణాలు తీసుకున్నవారిపై ఇప్పుడు నెలవారీ వాయిదాల భారం మోయలేని విధంగా తయారైంది. ఇది ఎస్బీఐ రుణగ్రహీతలపై ఇంకా పెరిగిందిప్పుడు. నిజానికి గత నెల జూన్‌లోనూ ఎంసీఎల్ఆర్‌ను ఎస్బీఐ 10 బేసిస్ పాయింట్ల వరకు పెంచింది. దీంతో అన్ని కస్ట్యూమర్ లోన్లు ఖరీదెక్కాయి.

ఎస్బీఐ రుణాలపై పెరిగిన వడ్డీరేట్లు (శాతాల్లో)

కాలవ్యవధి	ప్రస్తుత ఎంసీఎల్ఆర్	మారిన ఎంసీఎల్ఆర్	పెరుగుదల
ఓవర్‌నైట్	8.10	8.10	యథాతథం
ఒక నెల	8.30	8.35	5 బేసిస్ పాయింట్లు
3 నెలలు	8.30	8.40	10 బేసిస్ పాయింట్లు
6 నెలలు	8.65	8.75	10 బేసిస్ పాయింట్లు
ఏడాది	8.75	8.85	10 బేసిస్ పాయింట్లు
2 ఏండ్లు	8.85	8.95	10 బేసిస్ పాయింట్లు
3 ఏండ్లు	8.95	9.00	5 బేసిస్ పాయింట్లు

మారని ఈబీఎల్ఆర్

ఎస్బీఐ ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు (ఈబీఎల్ఆర్) 9.15 శాతం+సీఆర్పీ, బీఎస్పీగానే ఉన్నది. అన్ని గృహ రుణాలకు ఈ రేటే లింకై ఉంటుంది. సిబిల్ స్కోర్ ఆధారంగా ఖాతాదారులు తీసుకున్న రుణాలపై వడ్డీ రేట్లు 8.50 శాతం నుంచి 9.65 శాతం మధ్య ఉంటాయి. ప్రాసెసింగ్ ఫీజు తీసుకున్న రుణంలో 0.35 శాతానికి సమానంగా ఉంటుంది. దీనికి వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అదనం. అయినప్పటికీ మొత్తంగా కనీస ఫీజు రూ.2,000, గరిష్ఠం రూ.10,000గానే ఉంటుంది. ఇక గత ఏడాది జూన్ 15 నుంచి ఎస్బీఐ బేస్ రేటు 10.40 శాతంగానే ఉంటున్నది. అలాగే ఈ ఏడాది జూన్ 15 నుంచి బ్యాంక్ వార్షిక బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటు (బీపీఎల్ఆర్) 15.15 శాతంగా మారిన విషయం తెలిసిందే.

బెంగళూరులో జరిగిన టైమ్స్ నౌ ఇండియా ఇన్‌ఫ్రా ట్రాన్స్‌పోర్టేషన్ సమ్మిట్‌లో ఇంపాక్టబుల్ ఇన్‌ఫ్రా లీడర్-2024 అవార్డు అందుకుంటున్న ఎల్ అండ్ టీ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తదితరులు

ఐపీవోకి సాయి లైఫ్ సైన్సెస్!

న్యూఢిల్లీ, జూలై 15: హైదరాబాద్ కేంద్రస్థానంగా కార్యకలాపాలు అందిస్తున్న సాయి లైఫ్ సైన్సెస్..స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టబోతున్నది. ఇందుకు సంబంధించి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకున్నది కూడా. వ్యాపార విస్తరణకోసం అవసరమయ్యే నిధులో రూ.800 కోట్ల నిధులను ఐపీవో ద్వారా సేకరించడానికి సిద్ధమైంది. ప్రమోటర్లు, షేరుహోల్డర్లు, ఇన్వెస్టర్ షేరుహోల్డర్లకు చెందిన 6.15 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో విక్రయించనున్నారు. వాటాలు విక్రయించనున్న ప్రమోటర్లలో సాయి క్విస్ట్ సైన్ ప్రైవేట్ లిమిటెడ్, టీపీజీ ఆసియా 8 ఎస్ఎఫ్ పీటీఈ లిమిటెడ్, హెచ్‌బీఎం ప్రైవేట్ ఈక్విటీ ఇండియాలు ఉన్నాయి.

బీవోబీ మాన్‌సూన్ ధమాకా డిపాజిట్ స్కీం

న్యూఢిల్లీ, జూలై 15: ప్రభుత్వ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ).. మాన్‌సూన్ ధమాకా డిపాజిట్ స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ స్కీం కింద 399 రోజుల కాలపరిమితి కలిగిన రిటైల్ టర్మ్ డిపాజిట్లపై 7.25 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్న బ్యాంక్..333 రోజుల కాల పరిమితిపై 7.15 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది. అలాగే సీనియర్ సిటిజన్లకు అదనంగా మరో అర శాతం వడ్డీని చెల్లిస్తుండటంతో 7.65 శాతం నుంచి 7.75 శాతం మధ్యలో వడ్డీని ఆఫర్ చేస్తున్నది. రూ.3 కోట్ల లోపు టర్మ్ డిపాజిట్లకు ఈ ప్రత్యేక స్కీం వర్తించనున్నదని పేర్కొంది.

రాష్ట్ర మార్కెట్లోకి అపాచీ సరికొత్త బైకు

ధర రూ.1.20 లక్షలు

హైదరాబాద్, జూలై 15: టీవీఎస్ మోటర్.. రాష్ట్ర మార్కెట్లోకి సరికొత్త అపాచీ 160 సిరీస్ డార్క్ ఎడిషన్‌గా విడుదల చేసింది. వీటిలో టీవీఎస్ అపాచీ ఆర్టీఆర్ 160 మాడల్ ధర రూ.1,09,990, అపాచీ ఆర్టీఆర్ 160 4వీ మాడల్ ధర రూ.1,19,900గా నిర్ణయించింది. ఈ ధరలు హైదరాబాద్ షోరూంనకు సంబంధించినవి. ఈ సందర్భంగా కంపెనీ బిజినెస్ హెడ్ విమల్ సుంబ్లే మాట్లాడుతూ.. 160 సీసీ ఇంజిన్ సామర్థ్యంతో రూపొందించిన ఈ రెండు మోటర్‌సైకిళ్లు 17.6 పీఎస్ 9250 శక్తినివ్వనున్నదని, యువతకు నచ్చే విధంగా వీటిని రూపొందించినట్లు చెప్పారు. డిజిటల్ ఎల్‌సీడీ క్లస్టర్, ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్, యాంటీ బ్రేక్ సిస్టమ్‌వంటి ఫీచర్స్ ఉన్నాయి.

చెప్పేది విన్నాకే..

ఫ్రాడ్ రిస్క్ మేనేజ్‌మెంట్ మార్గదర్శకాలను మార్చిన ఆర్బీఐ

ముంబై, జూలై 15: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సోమవారం ఫ్రాడ్ రిస్క్ మేనేజ్‌మెంట్‌పై తమ మాస్టర్ డైరెక్షన్స్‌ను సవరించింది. ఏదైనా ఖాతాను మోసంగా ప్రకటించే ముందు సదరు ఖాతాదారుడు లేదా రుణగ్రహీత చేప్పేది బ్యాంకులు (రుణదాతలు) వినాలన్న సుప్రీం కోర్టు తీర్పు సిఫార్సు మేరకే ఈ మార్పులు చేసింది. ఎస్బీఐ, రాజేశ్ అగర్వాల్ కేసులో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. రుణగ్రహీతల హక్కులను గౌరవించాలని పేర్కొన్నది. ఈ క్రమంలోనే ఖాతాను మోసంగా వర్గీకరించే ముందు సదరు రుణగ్రహీత చెప్పినదాన్ని విని ఓ నిర్ణయానికి రావాలన్నది. దీంతో ఇకపై బ్యాంకులు దీన్ని అనుసరించాల్సిందేనంటూ ఆర్బీఐ తాజా మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.

టీ హబ్‌ను ఇన్‌ఫ్రా కార్పొరేట్ ఎక్సలెన్స్ అవార్డు వరించింది. కూరగాయల వ్యర్థాలను అధిక పోషక కంపోస్ట్ ఎరువుగా తయారు చేసి, వాటిని తిరిగి తమ ప్రాంగణంలో ఉన్న చెట్లకు వాడామని టీ హబ్ సీఈవో ఎంఎస్ రావు తెలిపారు. అదేవిధంగా ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి లీసైక్లింగ్ చేశామని, ఈ రెండు చర్యలకు గాను అవార్డు దక్కిందని ఆయన వెల్లడించారు.

టీసీఎస్‌లో ఫ్రెషర్లకు 40 వేల ఉద్యోగాలు!

న్యూఢిల్లీ, జూలై 15: దేశీయ టెక్నాలజీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్)..ఫ్రెషర్లకు పెద్దపీట వేస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి 40 వేల మంది ఫ్రెషర్లను నియమించుకునేయోచనలో సంస్థ ఉన్నది. గత ప్రమాసికంలో కొత్తగా 5,452 మందిని రిక్రూట్ చేసుకోవడంతో మొత్తం సంఖ్య 6,06,998కి చేరుకున్నారు. ప్రపంచ ఐటీ రంగంలో గణనీయమైన మార్పులకు లోనవుతున్న ప్రస్తుత తరుణంలో భారత్ ప్రతిభకు కేంద్రంగా మారిందని, భవిష్యత్తులో మార్పులు వచ్చే అవకాశాలు కనిపించడం లేదని టీసీఎస్ సీహెచ్ఆర్‌వో మిలింద్ లక్కాడ్ తెలిపారు.

ఆల్‌టైమ్ కనిష్ఠానికి రుపీ

మరో 10 పైసలు క్షీణించిన విలువ

83.61 స్థాయికి పతనం

ముంబై, జూలై 15: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ మునుపెన్నడూ లేని స్థాయికి దిగజారింది. సోమవారం ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకుతూ 83.61కి పడిపోయింది. గత శుక్రవారం ముగింపుతో చూస్తే 10 పైసలు తగ్గింది. ఒకానొక దశలో 83.62 స్థాయికి నష్టపోయింది. అయితే తిరిగి స్వల్పంగా కోలుకున్నది.

ద్రవ్యోల్బణం దెబ్బ

దేశీయంగా విజృంభిస్తున్న ద్రవ్యోల్బణం.. రూపాయిని ప్రభావితం చేస్తున్నట్టు బీఎన్పీ పరిబాస్‌కు చెందిన షేర్‌ఖాన్‌లో రిసెర్చ్ అనలిస్ట్‌గా ఉన్న అనుజ్ చౌదరి విశ్లేషించారు. ఈ క్రమంలోనే భారతీయ స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయి లాభాల్లో ముగిసినా.. ఆ ఉత్సాహాన్ని అందుకోలేకపోయినట్టు చెప్తున్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

తాంసి, జూలై 15: మండలంలోని పొన్నారి గ్రామంలోని ఎస్సీ కాలనీలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడువు గంగన్న సోమవారం ఆదిలాబాద్‌లో డీఈ హరికృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. చిన్నపాటి గాలివానకు ప్రతి రోజూ రాత్రి కరెంట్ ఇబ్బందులతో కాలనీవాసులు విసిగిపోయారని అన్నారు. డీఈ సానుకూలంగా స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని మండల విద్యుత్ అధికారికి ఆదేశించారు. ఇక్కడ నాయకులు ముచ్చ రఘు, ముక్కెర సుభాష్, తొగరి పోతన్న, బండి పేటన్న, తీగల పొచ్చన్న, రమాకాంత్, శంకర్, అశోక్ ఉన్నారు.

నిర్మల్ పోలీస్..మీ పోలీస్

నిర్మల్ అర్బన్, జూలై 15 : నిర్మల్‌లోని దీక్ష జూనియర్ కళాశాలలో సోమవారం పోలీసులు నిర్మల్ పోలీస్.. మీ పోలీస్ అనే వినూత్న కళాజాత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల జరిగే అనర్థాలను కళాజాత ప్రదర్శన ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖ యువత, ప్రజల రక్షణ భద్రత కోసం పని చేస్తుందని అన్నారు. అసాంఘిక శక్తులను కట్టడి చేసి ప్రజలకు మెరుగైన శాంతి భద్రతలను అందిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా కళాజాత ప్రదర్శనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ రవి కుమార్, జిల్లా షీటీం సిబ్బంది, జిల్లా కళాజాత బృందం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

బోథ్, జూలై 15 : జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని యువకుడుఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రంలోని న్యూకాలనీకి చెందిన వనపత్రి రాము (28)నాలుగు సంవత్సరాల క్రితం నిజామాబాద్‌కు చెందిన అమ్మాయితో వివాహమైంది. సంవత్సరం కాపురం తర్వాత రాముకు ఆమెతో వీడాకులు అయ్యాయి. మనస్తాపానికి గురైన రాము ఇంట్లో ఎవరు లేని సమయంలో ఊరి వేసుకున్నాడు. తండ్రి దత్తు మధ్యాహ్నం ఇంటి తలుపు తెరిచి చూడగా అప్పటికే రాము ఊరి వేసుకొని మృతి చెంది ఉన్నాడు. తండ్రి దత్తు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

పురుగుల మందు తాగి..

గుడిహత్నూర్, జూలై 15 : మద్యానికి బానిసై క్షణికా వేశంలో ఓ యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గుడిహత్నూర్ మండలంలోని గురుజ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఆ గ్రామానికి చెందిన కొల్లూరి తరుణ్(20)ఆదివారం సాయంత్రం పురుగుల మందుతాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు.

ఐదు కిలోల కణతి తొలగింపు

బోథ్, జూలై 15 : గుడిహత్నూర్ మండలానికి చెందిన గిరిజన మహిళ ఐదు సంవత్సరాలుగా తీవ్రమైన కడుపు నొప్పి తో బాధపడుతుంది. ఆమె బోథ్‌లోని ప్రసాద్ దవాఖానలో సంప్రదించగా గర్భసంచికి పెద్ద కణతి ఉన్నట్లు నిర్ధారించారు. డాక్టర్ రవీంద్ర ప్రసాద్, డాక్టర్ శివ ప్రసాద్, డాక్టర్ వెంకటేశ్, వైద్యులు బృందం రెండు గంటల పాటు శస్త్ర చికిత్స చేసి ఐదు కిలోల కణతిని తొలగించారు. మారుమూల ప్రాంతంలో ఇటువంటి ఆపరేషన్ చేసిన వైద్యుల బృందానికి రోగి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పర్యటించాలి

- ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి
- కలెక్టర్ రాజర్షి షా

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జూలై 15 : వర్షకాల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పర్యటిస్తు వ్యాధులు ప్రబలకుండా చూడాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులపై మండలంలోని ప్రత్యేకాధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజావాణిలో వచ్చే ఆర్జీల ను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఫిర్యాదుపై తీసుకుంటున్న వివరాలను అర్జీదారునికి తెలియ జేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆదన పు కలెక్టర్ శ్యామల దేవి, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి
కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు

భూ వివాదంలో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు సూరుకుంటి పోతారెడ్డి కోరారు. సోమవారం కలెక్టర్ రాజర్షి షాను ప్రజావాణిలో కలిసి వినతిపత్రం అందజేశారు. మావల మండలం బట్టి సావర్గాంలోని సర్వే నంబర్ 23/3లో 2.26 ఎకరాల భూమి ఉందన్నారు. అందులో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా సదరు ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన భార్య ,సోదరుడితో పాటు కుటుంబ సభ్యులను తనపై దాడికి పంపించారన్నారు. నా పంట చేనుకు వచ్చిన సదరు వ్యక్తులు భూమికి అడ్డు తొలగాలని లేకుంటే చంపెస్తామని బెదిరింపులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మావల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. సదరు వ్యక్తులతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేశారని తెలిపారు. ఉపాధ్యాయుడిపై శాఖ పరంగా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని వేడుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

అర్జీదారులతో మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్

నిర్మల్ అర్బన్, జూలై 15 : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న జిల్లా ప్రజావాణి, సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిశీలన చేపట్టి ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇక్కడ అదనపు ఫైజాన్ అహ్మద్, డీఆర్‌వో భుజంగ్ రావు, అదికారులు పాల్గొన్నారు.

ఫొటోఎక్స్పో పోస్టర్ ఆవిష్కరణ

ఎదులాపురం, జూలై 15 : హైదరాబాద్ ఎల్బీనగర్ కేబీఆర్ కన్వర్షన్ హాల్‌లో రాష్ట్ర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో ఫొటోఎక్స్పో కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు దోడ అశోక్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎక్స్పో పోస్టర్‌ను సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

సుంకిడిలో పోస్టల్ క్యాంపెనింగ్

తలమడుగు, జూలై 15 : మండలంలోని సుంకిడి గ్రామంలో సోమవారం మహిళా సాధికారత ఆధ్వర్యంలో పోస్టల్ క్యాంపెనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిఖిలేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సుకన్య సమృద్ధి యోజనతో పథకంతో ఆడబిడ్డకు అండగా ఉంటుందన్నారు.

తహసీల్దార్‌కు ముదిరాజ్‌ల వినతి

ఇచ్చోడ(సిరికొండ), జూలై 15 : రాష్ట్రంలోని ముదిరాజ్‌లను ఎస్టీ జాబితాలో కలపాలని కోరుతూ ముదిరాజ్ సంఘం నాయకులు సోమవారం సిరికొండ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎగ్గిడి మల్లు రెడ్డి, ఓరగంటి పెంటన్న, బోయిన్‌వార్ ఆమోర్, ఓరకంటి నర్సింలు, ఎగ్గిడి ఇస్తారి, సిహెచ్ జ్ఞానేశ్వర్, సుధాకర్, తులసిదాస్, ఆశన్న, దుద్రారపు ఇస్తారి, రుద్రారపు ప్రవీన్ పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

తలమడుగు, జూలై 15 : మండలంలోని సుంకిడి ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత సోమవారం తనిఖీ చేశారు. ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరుకొని పెచ్చులూడుతున్న తరగతి గదులను పరిశీలించారు. వాటిని తక్షణమే మరమ్మతులు చేయించాలని ఎంఈవో నారాయణను ఫోన్‌లో ఆదేశించారు. మన ఊరు-మన బడిలో భాగం గా ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన నాలుగు గదులను వర్షాకాలం పూర్తయ్యేంత వరకు నాలుగు నెలలపాటు ఉన్నత పాఠశాల తరగతుల బోధన కోసం వాడుకోవాలని ఆదేశించారు. సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. ఆమె వెంట పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు గజానన్, వై రాంరెడ్డి, సుకుమార్ పెట్కులే, శ్రీనివాస్ రెడ్డి, సుజాత, నాందేవ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేందర్ ఉన్నారు.

గుట్కా పట్టివేత

ఎదులాపురం, జూలై 15 : ఢిల్లీ నుంచి కర్ణాటకకు రూ.16లక్షల విలువైన నిషేధిత గుట్కాను కంటైనర్ వాహనంలో తరలిస్తుండగా మావల పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి సోమవారం తెలిపిన వివరాల ప్రకారం .. ఢిల్లీ నుంచి కర్ణాటకకు రూ.16లక్షల విలువైన గుట్కాను వే బిల్లులతో ఆదిలాబాద్‌లోని టైలర్స్ కాలనీకి తరలించడాన్ని గుర్తించి పట్టుకున్నారు. గుట్కా వ్యాపారులు తప్పుడు బిల్లులతో పట్టణంలో పలు చోట్ల గుట్కాను నిల్వ చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక గుట్కా వ్యాపారి షమ్ము కంటైనర్‌ను తెప్పించి నట్లుగా ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. షామ్ము, డ్రైవర్,క్లీనర్లపై మావల ఎస్ఐ విష్ణువర్ధన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వాహనాలకు నంబర్ ప్లేట్ తప్పనిసరి

కుంటాల, జూలై 15 : ప్రతి వాహనం రిజిస్ట్రేషన్ పొందిన నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా డిస్‌ప్లే చేయాలని ఖైసా రూరల్ సీఐ నైలు అన్నారు. మండలంలోని అందకూర్‌లో సోమవారం నిర్వహించిన కార్డెన్‌సర్చ్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. వాహనదారుడు సరైన పత్రాలు కలిగి ఉండాలని, లేకపోతే ప్రమాదాలు జరిగినప్పుడు ఇబ్బందులు ఏర్పడుతాయని అన్నారు. జూలై 1 నుంచి ప్రారంభమైన కొత్త చట్టాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఎవరికైనా గంజాయి జాడ తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. ఈ తనిఖీలో సరైన పత్రాలు లేని 82 బైక్లు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రజినీకాంత్ మాట్లాడుతూ ట్రిపుల్ రైడింగ్, మొబైల్ మాట్లాడుతూ బైక్ రైడింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

ఎదులాపురం, జూలై 15 : జిల్లాలోని వివిధ పాఠశాలలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) డిమాండ్ చేసింది. సోమవారం జరిగిన సంఘం సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సునీల్ చవాన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు లేని పాఠశాలల్లో తాత్కాలిక పద్ధతిలో విద్యా వలంటీర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగోన్నతులలో మిగిలిన పోస్టులలో ఎస్జీటీ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని, జిల్లా పరిధిలో జరిగిన స్పోస్ పాయింట్ల దుర్వినియోగంపై విచారణ జరిపి సీసీఏ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోర